

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

నిజామాబాద్
కామారెడ్డి

ఆదివారం 2 నవంబర్ 2025 5

సూర్య 19వ వసంతంలోకి


### రివిజన్ ప్రక్రియను

# సమర్ధవంతంగా చేపట్టాలి

### - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**




స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను సమర్ధవంతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని తెలిపారు. మొదట కేటగిరి "ఎ" జాబితాను బి ఎల్ ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవడం జరుగుతుందని, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల ఓటర్లను నిర్ధారించడం జరిగిందని, మిగిలిన 12 లక్షల ఓటర్ల నిర్ధారణ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కేటగిరి సి, క్యాటగిరి డి లలోని ఓటర్లను కేటగిరి ఎ కు మ్యాపింగ్ చేసే ప్రక్రియను మెరుగుపరచాలని తెలిపారు. కాగా, అంతకుముందు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఈ.ఆర్.ఓలు, ఏ ఈ ఆర్ ఓ లు, బీఎల్ఓ సూపర్వైజర్లు, బీ ఎల్ ఓలతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (మిగతా 2లో)




# అతి కిరాతకంగా మహిళ హత్య...

### - తల లేని మొండంతో మృతదేహం లభ్యం..

### - వరుస హత్యలతో హడలిపోతున్న మండల ప్రజలు..



**సూర్య నవీపేట్**

మండలంలో దారుణం చోటు చేసుకుంది. గుర్తుతెలియని దుండగులు మహిళపై అత్యాచారం చేసి హత్య చేసిన ఆనవాలతో మహిళ మృతదేహం లభ్యమయింది. దారుణంగా తల నరికివేసి మొండెం వేరు చేశారు. ఈ ఘటన శనివారం ఉదయం వెలుగు చూసింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని ఫకీరాబాద్ నుంచి మిట్టాపూర్.. వెళ్లి దారిలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మహిళను వివస్త్రను చేసి, అత్యాచారం చేసి దారుణంగా హతమార్చారు. ఆమె మొండెం నుంచి తలను వేరు చేశారు. మొండాన్ని అక్కడే వదిలేశారు. తల ఇంకా లభించలేదు. ఆమె చేయిని సైతం మణికట్టు వరకు నరికి వేశారు. తెలిసిన వారే (మిగతా 2లో)



### జిల్లాలోని మోడల్ సోలార్ గ్రామం

# పారదర్శకంగా ఎంపిక చేయాలి

### - కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



PM సూర్యఘర్ ముఫ్తీ బిజిలి యోజన-మోడల్ సోలార్ విలేజ్ పథకం భాగంగా మోడల్ సోలార్ గ్రామం ఎంపిక కోసం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ ఏర్పడింది . ఈ పథకం ద్వారా దేశంలోని ప్రతి జిల్లాలో ఒక మోడల్ సోలార్గ్రామాన్ని స్థాపించడం లక్ష్యంగా పెట్టుకుందని, మార్గదర్శకాల ప్రకారం,ఒక గ్రామం ఎంపికకు అర్హత పొందాలంటే 5000 కంటే ఎక్కువ జనాభా కలిగి ఉండాలన్నారు. (తాజా జనాభా లెక్కల ప్రకారం). ఈ నిబంధనల మేరకు, కామారెడ్డి జిల్లాలోని ఎంపికకు 18 అర్హతగల గ్రామాలు పోటీకి అర్హత పొందాయి. పోటీ కాలం ముగిసిన అనంతరం అన్ని గ్రామాలలో అత్యధిక సోలార్ వ్యవస్థ శక్తి కలిగిన గ్రామం జిల్లాకు మోడల్ సోలార్ గ్రామంగా ఎంపిక అవుతుంది. పోటీ కాలం పూర్తయిన తర్వాత సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద మోడల్ సోలార్ విలేజ్ కామారెడ్డి జిల్లాలోని భిక్నూర్ గ్రామం ఎంపికైనట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఈ పథకంతో అన్ని రకాల ప్రభుత్వ భవనాలకు ఉచితంగా సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయబడ్డాయి. మార్గదర్శకాల ప్రకారం, సోలార్ గ్రామ మార్గదర్శకాలకు అనుగుణంగా వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక డిపిఆర్ తయారు చేయాలని సౌర శక్తికి సంబంధించిన అధికారులను ఆదేశించారు. డిపిఆర్ ఆమోదం పొందిన సంవత్సరం లోపు ప్రాజెక్టులు పూర్తిగా అమలు అయ్యేలా చూసుకోవాలని, కామారెడ్డి జిల్లా స్థాయి కమిటీ క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపారు.



### సీఎంను కలిసిన

# ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి




**సూర్య బోధన్**

ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం సుదర్శన్‌రెడ్డిని ఇటీవల ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సలహాదారుగా నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ముఖ్యమంత్రిని కలిసి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సీఎం సుదర్శన్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జిల్లాకు చెందిన నాయకులు తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్ రెడ్డి, ఈరవత్రి అనిల్, ముత్యాల సునీల్ రెడ్డి, నగేశ్ రెడ్డి, కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

### ఐ.డీ.ఓ.సీలో కలెక్టర్, సీ.పీలతో భేటీ అయిన

# ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్

### - బాధిత కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

రాష్ట్ర షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఇతర అధికారులతో భేటీ అయ్యారు. పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డు కులాలు, తెగల వారి కోసం వెచ్చిస్తున్న నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై బాధితుల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. ఐ.డీ.ఓ.సీకి చేరుకున్న కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అంతకుముందు ఆయన బాధిత సీ.సీ.ఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమోద్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విధి నిర్వహణ సందర్భంగా కానిస్టేబుల్ హత్యకు గురి కావడం ఎంతో బాధ కలిగించిందని, బాధిత కుటుంబానికి కమిషన్ అండగా నిలుస్తుందని, పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చూస్తామని భరోసా కల్పించారు. చైర్మన్ వెంట ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, అభివృద్ధి శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు ఉన్నారు.



# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై రివ్యూ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**




రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అన్ని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు డీఈఓ ఎన్నికల రిజిస్టరింగ్ అధికారులు ఈఆర్వో పాల్గొన్నారు. గత శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఇప్పటి వరకు జిల్లాల వారీగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాల పురోగతిపై సమీక్ష చేపట్టారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, సంబంధిత విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమీక్షా సమావేశంలో మ్యాపింగ్ కార్యక్రమాన్ని బి ఎల్ ఓ లు, సూపర్వైజర్లు పోలింగ్ కేంద్రకవారిగా పకడ్బందీగా నిర్వహించాలనిక్యాటగిరి వారిగా ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని అన్నారు.

# భవిత కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



నిజామాబాద్ నగరంలోని కోటగల్లి శంకర్ భవన్ పాఠశాలలో కొనసాగుతున్న భవిత కేంద్రాన్ని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం సందర్శించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఉద్దేశించిన ఈ కేంద్రంలో చేపట్టిన నిర్మాణ పనులను పరిశీలించారు. అన్ని చోట్ల నాణ్యతతో పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. చిన్నారులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిత కేంద్రాల నిర్మాణాలు, మరమ్మతుల కోసం అవసరమైన పక్షంలో జిల్లా యంత్రాంగం ద్వారా కొంత మేరకు అదనపు నిధులను కూడా సమకూరుస్తామని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అన్నారు. అనంతరం కలెక్టర్ శంకర్ భవన్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు ముఖ గుర్తింపు విధానంలో అమలు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. నూటికి నూరు శాతం ఎఫ్.ఆర్.ఎస్ విధానంలోనే హాజరు ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే, వాటిని పరిష్కరించుకుంటూ ఎఫ్.ఆర్.ఎస్ పద్ధతిలోనే అటెండెన్స్ అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని పాఠశాల హెచ్.ఎంను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులచే ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కిచెన్, హెర్బల్ గార్డెన్ ను కలెక్టర్ పరిశీలించి అభినందించారు. కలెక్టర్ వెంట ఇంజినీరింగ్ విభాగం అధికారులు జి.రవి, ఉదయ్ కిరణ్, ఎం.ఈ.ఓ సాయిరెడ్డి, భవిత కేంద్రాల జిల్లా ఇంచార్జి ప్రకాష్, సి.ఎం.ఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

**సూర్య- నవీపేట్**



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి 98 కేజీ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన జడ్పిహెచ్ఎస్ జన్నేపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి పూర్ణానంద రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ తెలిపారు. ఈ నెల 2 నుంచి 4 వరకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ లో జరిగే రాష్ట్రస్థాయి 98 కేజీ విభాగంలో జరగనున్న ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొననున్నాడని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పూర్ణానందను ప్రధానోపాధ్యాయులు అశోక్, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## లోకల్ బాడి అదనపు కలెక్టర్ ఏసీఎల్ బి ఇంచార్జిగా మదన్ మోహన్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



జిల్లా రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మదన్ మోహన్ కు ఇంచార్జి లోకల్ బాడి అదనపు కలెక్టర్ గా బాధ్యతలు అప్పగించిన జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ అదనపు కలెక్టర్ లోకక్ బాడి బాధ్యతలను శనివారం స్వీకరించినందున జిల్లా కలెక్టర్ గారిని మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పై ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి నిర్మాణ పనుల్లో ఎలాంటి లోటుపాట్ల కు తావులేకుండా వంద శాతం పనులు జరగేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలిపారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల ఇన్చార్జిగా జక్కుల సంతోష్ కు బాధ్యతలు

**- జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ నేత**

**సూర్య ఎల్లారెడ్డి**



బీసీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం కృషి చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘంజిల్లా అధ్యక్షులు చింతల శంకర్ నేత చేతుల మీదుగా శనివారం ఎల్లారెడ్డి మండల ఇంచార్జిగా జక్కుల సంతోష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చింతల శంకర్ నేత మాట్లాడుతూ బీసీ వర్గాల అభివృద్ధి కోసం గ్రామ స్థాయి నుండి పోరాడే నాయకులు కావాలి. సంతోష్ లాంటి యువ నాయకులు సంఘాన్ని మరింత బలపరుస్తారు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జక్కుల సంతోష్ కుమార్ (వెల్లుట్ల) మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రజా సేవకు వేదికగా మార్చుకుంటాను. ఎల్లారెడ్డి మండలంలోని ప్రతి బీసీ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తాను అని తెలిపారు. ఈ నియామకంతో ఎల్లారెడ్డి మండలంలో బీసీ సంక్షేమ కార్యక్రమాలకు కొత్త దిశ లభించనున్నదనే ఆశాభావం వ్యక్తంచేశారు

## మాజీ మంత్రి హరీష్‌రావును పరామర్శించిన మాజీ జెడ్పీటిసి

**- ఉమ్మన్నగారి మనోహర్ రెడ్డి**

**సూర్య, నాగిరెడ్డిపేట్**

మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీష్‌రావు, తండ్రి సత్యనారాయణ ఇటీవల మరణించిన విషయం విధితమే. శనివారం స్థానిక మాజీ జెడ్పిటిసి ఉమ్మన్న గారి మనోహర్ రెడ్డి హైదరాబాద్ కోకాపేటలోని హరీష్ రావు నివాసం వెళ్లి పరామర్శించి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. వారి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## అతి కిరాతకంగా మహిళ హత్య..

(మొదటి పేజి తరువాయి)

మహిళను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువచ్చి అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసి ఉంటారా లేక ఇతర ప్రాంతంలో అత్యాచారం, హత్య చేసి ఇక్కడకు తీసుకువచ్చి తల మొండెం వేరు చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు ఇచ్చిన సమాచార మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం, డాగ్ స్కాడ్ తో తనిఖీలు నిర్వహించారు. సీపీ సాయి చైతన్య ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా మండలంలో గల నాగేపూర్ గుట్ట ప్రాంతంలో సెప్టెంబర్ 19న గోనె సంచిలో చుట్టబడి కుళ్లిపోయిన మృతదేహం కేసు, గత నెల 24న పెట్రోల్ పోసి మహిళను హత్య చేసిన కేసులు ఇంకా కొలిక్కి రాకముందే మరో మహిళ ను దారుణంగా హత్య చేయడం కలకలం రేపుతుంది. రెండు నెలల వ్యవధిలోనే మండలంలో మూడు హత్యలు జరిగాయి. రెండు కేసులు విచారణలో ఉండగానే మరో హత్య జరగడంతో వరుస ఘటనలు స్థానిక ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇది సరిహద్దు ప్రాంతం కావడంతో హంతకులు వారికి అనుకూలంగామార్చుకుని నేరాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాలలో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు లేకపోవడం నేరగాళ్లకు అనుకూలంగా మారింది. మహిళ ఆచూకీ కోసం పోలీసులు మిస్సింగ్ కేసులను పరిశీలిస్తున్నారు. మిస్సింగ్ కేసులు తెలిస్తేనే హత్య కేసు దర్యాప్తు ముందుకు సాగే అవకాశం ఉన్నందున ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ. బృందాలుగా ఏర్పడి క్లూస్ టీం, డాగ్ స్కాడ్ తో దర్యాప్తును ప్రారంభించామని త్వరలోనే అంతకులను పట్టుకుంటామని తెలిపారు.

## రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలి

(మొదటి పేజి తరువాయి)

నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ ఐ ఆర్ సన్నాహక ప్రక్రియ పురోగతిపై సమీక్ష జరిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా సరైన పద్ధతిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను నిర్దిష్ట గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్లక్ష్యానికి తావు కల్పిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. 2002 ఓటరు జాబితా, ప్రస్తుత 2025 ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఆదివారం సాయంత్రం లోగా మ్యాపింగ్ పూర్తి చేయాలని గడువు విధించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వారీగా ఈ ప్రక్రియను బీఎల్ఓ లు సజావుగా పూర్తి చేసేలా బీ ఎల్ ఓ సూపర్వైజర్లు, ఏఈఆర్ఓ లు స్వీయ పర్యవేక్షణ.చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ఆర్డీఓ రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ చైర్మన్ కు గర్గుల్ బాధితుల మొర

**సూర్య కామారెడ్డి టౌన్**



కామారెడ్డి మండలంలోని గర్గుల్ గ్రామంలో ఎస్సీలకు సంబంధించిన బాధితులు తమ యొక్క గోడును ఎస్సీ ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య గారికి తమ యొక్క సమస్యల పైన వినతి పత్రం అందజేశారు , సుమారు 40 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి స్థలాల్లో ఇల్లు కట్టుకొని నివసిస్తున్నాము, ప్రస్తుతం ఇతరులు దీన్ని కొత్త పాసుబుక్ చేసుకుని బ్యాంకు లో లేవు తీసుకున్నారని మా స్థలాలు మాకు చూపించాలని వారి గోడు వెలగబెట్టు కున్నారు. మాకు తగిన న్యాయం చేయాలని బాధితులు ఎస్సీ ఎస్టీ చైర్మన్ కుమార పెట్టు కున్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో శ్రీనిధి

**సూర్య,బీర్కూర్**



అంగన్వాడి కేంద్రాలను మరియు గ్రామ పంచాయతీలను శనివారం బీర్కూరు మండల పంచాయతీ అధికారి శ్రీనిధి తనిఖీ నిర్వహించారు. దామరంచ గ్రామ పంచాయతీ లోని ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులు నిర్మించుకున్న పశువుల కొట్టం పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, పనులు నాణ్యత మరియు పథకం అమలుపై ఏపీఓ అక్మల్ ని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలోని అంగన్వాడి సెంటర్ ను సందర్శించి పిల్లలతో, బాలింతలతో వారికి అందుతున్న పోషకాహారం అంగన్వాడి సిబ్బందికి అడిగి తగు సూచనలు చేశారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా, సమర్థవంతం గా జరిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఆమె వెంట ఏపిఓ అక్మల్, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ కాశిరాం, కారోబార్ దత్తు ఉన్నారు.

## శబరిమల అయ్యప్ప ఆలయం వరకు పాదయాత్ర ను

# అర్బన్ ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించడం జరిగింది

సూర్య ఇందూర్



ఇందూరు పట్టణం నుండి కేరళలోని పవిత్రమైన శబరిమల అయ్యప్ప ఆలయం వరకు మహా పాదయాత్రకు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ 8 శనివారం నాడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "భక్తి మరియు నియమ నిష్టలు మన భారతీయ సంస్కృతికి ఆధ్యాత్మిక పునాది. నిజామాబాద్ నుండి కేరళ వరకు జరుగుతున్న మహా పాదయాత్ర అనేది కేవలం భౌతిక ప్రయాణం మాత్రమే కాదు ౹ అది ఆంతరిక సాధన, ఆత్మీయ మార్గం. ఇలాంటి పాదయాత్రలు యువతలో ధార్మిక చైతన్యాన్ని, నియమశీలతను పెంపొందించడంతో పాటు, సమాజంలో ఐక్యతను బలపరుస్తాయి. అయ్యప్ప స్వామి భక్తుల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసే శక్తి, ప్రసాదించాలని ఆ మణికంఠుడిని ప్రార్థిస్తున్నాను. అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు. ఈ మహా పాదయాత్రలో పురంశెట్టి నంద కిషోర్, నూరు రాజేందర్, వేణు, సాయిరెడ్డి, సుధాకర్, దీపక్, గంగా ప్రసాద్ తదిత ర భక్తులు పాల్గొంటు న్నారు. వీరందరూ శబరిమల స్వామి దర్శనం కోసం నిజామాబాద్ నుంచి సుమారు 1500 కి.మీ. దూరాన్ని పాదయాత్రగా పూర్తి చేయనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో స్థానిక భక్తులు, ప్రజా ప్రతి నిధు లు, అయ్యప్ప సేవా సంఘ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని అయ్యప్ప స్వామి నామస్మరణతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# కాంగ్రెస్ హత్యా రాజకీయాలను ఖండించండి

**- సిపిఎం కామారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్**

సూర్య కామారెడ్డి టౌన్



ఖమ్మం జిల్లాలో CPM పార్టీ రాష్ట్ర నాయకులు సామినేని రామారావు ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని CPM కామారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాల తో ప్రజా ఉద్యమాలను ఆపలేరనీ ఖమ్మం జిల్లా లో CPM పార్టీ రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్య ఘటన అత్యంత ఆందోళన కలిగించే విధంగా ఉందని CPM పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారులి. కార్యాలయంలో వారి మృతి కి ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ సమావేశంలో మాట్లాడారు. అనేక ప్రజా ఉద్యమాలకు రైతాంగ ఉద్యమాలకు నాయకత్వం వహించిన రామారావు ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామాల్లో నిన్న తెల్లవారుజామున కాంగ్రెస్ మూకల కిరాయి గుండాలు అత్యంత కిరాతకంగా చంపారు. సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శిగా పార్టీ జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు .పాతర్లపాడు గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్ గా రెండు సార్లు ప్రజాప్రతినిధిగా పనిచేశారు గ్రామంలో రాజకీయంగా సిపిఎం ను ఎదుర్కోలేని కాంగ్రెస్ గుండాలు కిరాయి గుండాలతో చంపించారనీ సౌమ్యుడు ప్రజలలో కలిసి పోయే మనిషిగా పేరు ఉండి అనేక ఉద్యమాలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు ఉమ్మడిగా నిర్వహించిన సందర్భంలో అంకితభావంతో పనిచేశారని చెప్పారు వారి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో cpm పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ గౌడ్, మోతిరం, కొత్త నర్సింలు జిల్లా కమిటీ సభ్యులు రేణుక, ముదాం అరుణ్ లు ఉన్నారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

సూర్య రెంజల్



ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన టువంటి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగో లు చేయాలని సిపిఐ ఎంఎల్ నాయకులు నడిపి నాగన్న, పార్వతి రాజేశ్వర్, గుమ్ముల గంగాధర్ డిమాండ్ చేశారు.

శనివారం రెంజల్ మండలంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, వినతి పత్రాన్ని అంద జేశారు. మోంథా తుఫాన్ వల్ల రెంజల్ మండల్ రైతాంగం వచ్చిన పంట నష్టపోయారని కష్టపడ్డ రైతాంగం కుడితిలో పడ్డ ఎలుకలా మారిందని తక్షణమే యుద్ధ ప్రతిపాదికన ధాన్యాన్ని కొనుగోలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్లో సెప్టెంబర్ మొదటి వారంలో వరి పంట సోయా పంటలు నీట తడిసి తీవ్రంగా నష్టపోయారన్నారు. వందలాది.ఎకరాల్లో ఇసుక మేడలు పెట్టయని అన్నారు. 14% కురిసిన వర్షం ఐకెపి, సహకార సంఘాలు, ధాన్యం వరి సోయాబీ కొనుగోలు చేయాలి. రైతులకు ఇప్ప టికైనా బ్యాంకులో క్రాప్ లోన్ తీసుకున్న వారికి ఇన్సూరెన్స్ చేయాలని, బ్యాంకు వాళ్ళ నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం అందించాలన్నారు. ఎకరానికి 50 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోసిపిఐ ఎంఎల్ ప్రజాపంతా మాస్ లైన్ మండల కార్యదర్శి షేక్ నసీర్,ఒడ్డెన్న, పోశెట్టి, గంగాధర్, జబ్బర్, తరుణ్, లక్ష్మణ్ తోపాటు పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత

సూర్య రెంజల్

అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్ ను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాల్లోకి వెళ్తే రెంజల్ మండలంలోని నీలా గ్రామ శివారులో తెల్లవారుజామున 5:30 గంటల ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్ ను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను బోధన్ మండలంలోని హంగర్ గ్రామం నుండి నీలా మీదుగా తరలిస్తుండడంతో పట్టుకొని పోలీస్ స్టేషన్కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి తదుపరి చర్యల కొరకు మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## విజిలెన్స్ వారోత్సవం - నిష్పాకికతతో సివే లక్ష్యం

**- "విజిలెన్స్ అవేర్నెస్ 6వ రోజు వారోత్సవం"**

సూర్య ఇందూర్



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టీజీఎస్ఆర్టీసీ నిజామాబాద్ రీజియస్ మేనేజర్ కార్యాలయంలో విజిలెన్స్ అవేర్ నెస్ 6వ రోజు వారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ యస్. మాధుసూదన్ పాల్గొని విజిలెన్స్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన, "ప్రతి ఉద్యోగి నిజాయితి, క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వర్తించాలి. విజిలెన్స్ అంటే కేవలం పర్యవేక్షణ మాత్రమే కాకుండా మన మనసులోని ధర్మాన్ని కాపాడుకోవడం కూడా" అని పేర్కొన్నారు. ఆయన అవినీతి రహిత వాతావరణం ఏర్పాటుకు అందరూ భాగస్వాములవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొని, విజిలెన్స్ ప్రతిజ్ఞ స్వీకరించా రు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడినందుకు అందరికి ధన్యవాదాలు తెలిపారు.

## మున్నూరు కాపుల (పటేల్)ఆత్మీయ సమ్మేళనం

సూర్య కామారెడ్డి టౌన్




నేడు హైదరాబాదులోని మూసాపేటలో మెజిస్టిక్ గార్డెన్స్ మూసాపేట ఫ్లైఓవర్ ఎర్రగడ్డ నందు ఆదివారం రోజున తెలంగాణ నలుమూలల నుంచి మున్నూరు కాపు ముద్దు బిడ్డలు మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనాలని కామారెడ్డి జిల్లా మున్నూరు కాపు జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ పటేల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ యొక్క సమ్మేళనానికి జిల్లా నుండి మున్నూరు కాపులు అందరూ పాల్గొని బీసీల ఐక్యతకు మున్నూరు కాపులు మూలమణి , భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు. 42 శాతం రిజర్వేషన్ పోరాటంలో ఒక భాగమని అందరూ గ్రహించాలని కోరారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

**-జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు**

సూర్య- బిక్కనూర్



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని, జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కుంట లింగారెడ్డి భీమా వ్యక్తం చేశారు. శనివారం జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ చేపట్టిన ప్రజా పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ఎన్ని కుట్రలు పన్నిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలంనకు ప్రత్యేక బస్సు సౌకర్యం

సూర్య ఇందూర్

నిజామాబాద్ పట్టణ, పరిసర ప్రాంత భక్తులకు కార్తిక మాసంలో చేసే శివారాధనకు విశేష పుణ్యఫలం లభిస్తుందని అట్టి భక్తుల కొరకై, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అరుణాచలం లో జరిగి గిరి ప్రదక్షిణకు ప్రత్యేక SUPPER LUXURY బస్సు నిజామాబాదు-1 డిపో నుండి ఏర్పాటు చేయడం జరిగింది. నిజామాబాద్ బస్ స్టేషన్ నుంచిప్రత్యేక బస్సు తేదీ: 03.11.2025 మధ్యాహ్నం 03.00 గం.లకు బయలుదేరుతుంది. కాణిపాకం, వెల్లూరు గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, కంచి, జోగులాంబ మరియు బీచుపల్లి హనుమాన్ టెంపుల్ దర్శన అనంతరం తేది 07.11. 2025 తెల్లవారు జామున నిజామాబాద్ చేరుతుంది. అలాగే వెబ్ సైట్ www.tgsrtcbus.in ద్వారా లేదా మీకు సమప బస్సు రిజర్వేషన్ కౌంటర్ నందు కూడా సర్వీసు నం.98883 తో టికెట్ పొందవచ్చు. టిక్కెట్ బుక్ చేసుకునే సౌకర్యం కలదని నిజామాబాద్ రీజినల్ మేనేజర్, శ్రీమతి. టి. జోన్నా గారు కోరారు. వివరాలకై ఈ క్రింది నెంబర్లు లకు సంప్రదించండి. 1) 7382840367 2) 9490410939 3) 9347050695

## పశు వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

సూర్య- బిక్కనూర్



పశువులలో సోకే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ చెప్పారు. శనివారం మండలంలోని గుర్జగుంటలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికొంటూ నివారణ టీకాల ప్రక్రియను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయంగా పశువులకు మండల పశు వైద్యాధికారి దేవేందర్ తో కలిసి గాలికుంటు నివారణ టీకాలను ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు సకాలంలో టీకాలు ఇప్పించడంలో పశు వైద్య సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 44 పశువులకు టీకాలు వేశారు. గాలికుంటూ టీకాల కార్య క్రమం ఈనెల 10వ తేదీ వరకు కొనసాగుతుం దని, రైతులు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సురేష్, భరత్ కుమార్ పాడి రైతులు పాల్గొన్నారు

## ఆత్మగౌరవ సభ విజయవంతం చేయండి

సూర్య- నవీపేట్



హైదరాబాద్లో నేడు జరగనున్న దళితుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆకారం రమేష్ శనివారం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి పై దాడి చేసిన వ్యక్తి మీద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, దాడి వెనక ఉన్న శక్తులను గుర్తించి శిక్షపడేల స్వతంత్ర దర్యాప్తును చేయాలని, సుప్రీంకోర్టులో ప్రజాస్వామికవాదులుగా గుర్తించబడ్డ సీనియర్ జడ్జిలతో విచారణ జరిపించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాదులో జరగనున్న దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనకు బయలుదేరారు.

# తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో బీసీ 42% రిజర్వేషన్ పై సదస్సు

**- తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, జస్టి సుదర్శన్ రెడ్డి, కేఎల్ విశ్వేశ్వరరావు చంద్రకుమార్ ,సీనియర్ జర్నలిస్ట్ రామచంద్ర మూర్తి వక్తలు పాల్గొన్నారు**

**సూర్య కామారెడ్డి టౌన్**

రాజ్యాంగ సవరణ చేసి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఎలా చేశారు అదేవిధంగా బీసీలకు 42% 9వ షెడ్యూల్లో చేర్చి రిజర్వేషన్ కల్పించాలని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు జస్టిన్ చంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు స్వతంత్రంగా చట్టాలు చేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించి ందని 10% కూడా లేని కులాలకు 50% , 50% ఉన్న కులాలకు 42% రిజర్వేషన్ కల్పించకపోవడం దారుణమని అన్నారు కోదండరాం మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన కుల మతాల లకు సరైన రిజర్వేషన్ కల్పించి నప్పుడు గౌరవప్రదమైన జీవనాన్ని సామాజిక



న్యాయాన్ని పొందగలమని బీసీలకు 42% రిజ ర్వేషన్ తెలంగాణ జన సమితి గట్టిగా సమర్థి స్తుందని అందులో భాగంగా ఈ సదస్సులో పలు తీర్మానాలు చేయడం జరిగింది 42 రిజర్వేషన్ అంశంపై జిల్లాలలో సదస్సులు హైదరాబాదులో భారీ ఎత్తున ర్యాలీ అఖిలపక్షం ప్రస్తుత ముఖ్య మంత్రి కలుపుకుని కోదండరాం ఆధ్వర్యంలో ఢిల్లీకి తీసుకెళ్లడం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవ డం మొదలుకున్నవి తీర్మానించబడింది ఈ కార్య క్రమంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర కమిటీ వివిధ జిల్లాల నాయకులు మరియు కామారెడ్డి జిల్లా నుండి అధ్యక్షులు కుంభాల లక్ష్మణ్ యాదవ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జనరమేష్ మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి వనిత సుజాత రజనీకాంత్ రాజు మొదలగున వారు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన మండల నాయకులు

**సూర్య- నవీపేట్**



శుక్రవారం ప్రభుత్వ సలహాదా రుడుగా నియమితులైన మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే పొద్దుటూ రు సుదర్శన్ రెడ్డి ని మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భ ంగా మండల నాయకులు, ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డిని శాలువాతో సన్మా నించి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన బాధ్యతలతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రభుత్వ సలహాదారునిగా నియమితులైన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియోజకవర్గ నాయకులతో కలిసివెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ప్రభుత్వ సలహాదారునిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులైన విద్యార్థులకు పాఠశాల భవనాలు, తాగునీటి సౌకర్యం మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు, మండల విద్యా వనరుల అధికారి రాజా గంగారెడ్డి చెప్పారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో యు డైస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భ ంగా 2025-26 విద్య సంవత్సరానికి సంబంధించిన పాఠశాల వివరాలు, మరియు విద్యార్థులకు ఉపాధ్యాయుల బోధన ప్రగతిపై చర్చించారు. ప్రతి పాఠశాలకు సంబంధించిన వివరాలను సోమవారంలోగా యూ డి సి ప్లస్ వెబ్ సైట్ లో పొందుపరచాలని, ప్రభుత్వ మరియు ప్రైవేటు ఉపాధ్యాయు లకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠ శాలల ప్రధానోపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, ఎమ్మెస్ కోఆర్డినేటర్ పాపయ్య, సీఆర్పీలు సత్యం, మహేందర్, పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఏఈఓ

**సూర్య నిజాంసాగర్**



మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈఓ మన్నే సాగర్ శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబె ట్టిన వరి ధాన్యాన్ని, వరి ధాన్యం తూకం చేస్తున్న బస్తాలను ఆయన పరిశీలించారు. రైతులు వడ్లను ఎండ బెట్టి ప్రభుత్వం నిర్ణయించిన మేర తేమ శాతం వచ్చేలా చూసుకోవాలన్నా రు. రైతులు ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేం ద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, రైతులు బొజ్జ భాను, బంజ గంగారాం,,ఎముల సాయిలు,అక్తర్ పాషా, అంజయ్య,ఎముల నర్సింలు, మంగలి కిషన్ లతోపాటు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ ను కలసిన జిల్లా నేతలు సుదర్శన్ రెడ్డి కి పదవి ఇచ్చిన నందుకు కృతజ్ఞతలు

**సూర్య ఇందూర్**



సీఎం రేవంత్ రెడ్డి ని నిజామాబాద్ జిల్లా నేతలు శనివారం కలిశారు.పీసీసీ అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు మోహన్ రెడ్డి, నగేష్ రెడ్డి, సునీల్ రెడ్డి అనిల్ ఇరవత్రి, నూడా ఛైర్మెన్ కేశ వేణు సీఎం ను కలిశారు. సీనియర్ నేత అయిన సుదర్శన్ రెడ్డి కి ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చిన ందుకు వారంతా సీఎం కు కృతజ్ఞతలు చెప్పారు. మరో సుదర్శన్ రెడ్డి సైతం సతీసమేతంగా సీఎం రేవంత్ దంతులను కల్సి కృతజ్ఞతలు చెప్పారు.

## మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌ను కలిసిన ఎల్లమ్మగుట్ట మున్నూరు కాపు సభ్యులు

**సూర్య ఇందూర్**



నిజామాబాద్ నగరంలోని మున్నూ రు కాపు సంఘం నూతన అధ్యక్షు లు గా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ను ఎల్లమ్మ గుట్ట,బొబ్బిలి వీధి మున్నూ రు కాపు సంఘం ప్రతినిధులు వారి స్వగృహంలో శనివారం మర్యాద్యపూరకంగా కలిశారు.ధర్మపురి సంజ య్ కు పూలబోకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్య క్రమానికి అధ్యక్షుడు బొబ్బిలి మోహన్,ప్రధాన కార్యదర్శి ఉల్లెంగ నాగరా జు,వైస్ ప్రెసిడెంట్ పంచ రెడ్డి సంతోష్,జనరల్ సెక్రెటరీ నైనోల్ల వెంకటే ష్,పెద్ద కాపులు:పంచ రెడ్డి సాయిలు,బూస సాయిలు,ఎండల లక్ష్మణ్, మేనేజర్ బొబ్బిలి మనోహర్, సంఘ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ ఆలయ వార్షిక మహోత్సవం

**సూర్య రెంజల్**



శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా మహా యజ్ఞ హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు.మండల కేంద్రంలో గ్రామ దేవత అయినటువంటి శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి ఉదయం నుండి అభిషేకాలు, పూజ కార్యక్రమాలను నిర్వహిం చారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వేద పండితుల మంత్రో చ్ఛరణల మధ్య మహా యజ్ఞం హోమ కార్యక్రమాన్ని చేపట్టారు. యజ్ఞ హోమం కార్యక్రమాన్ని నిర్వహించి పూర్ణాహుతి తో సమాప్తం చేపట్టారు. ఈనెల తొమ్మిదో తేదీన అమ్మవారికి బోనాల పండుగను నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీని నిర్వాకులు తెలిపారు. కొరకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, దంపతులు, మహిళలు భక్తులు పాల్గొన్నారు.

## సీఆర్పీల శిక్షణ విజయవంతం

**రాజంపేట సూర్య**




రాజంపేట మండల సమైక్య ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన సీఆర్పీల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర సీఆర్పీలు జ్యోతి, సరళ శిక్షణను సమగ్రంగా నిర్వహించారు. గ్రామ సంఘాల అధ్యక్షు రాళ్లు, మండల కార్యవర్గ సభ్యులకు సంఘ నిర్మాణం, ఆర్థిక నిర్వహణ, రికవరీ విధానం, మహిళా సాధికారత వంటి అంశాలపై అవగాహన కల్పిం చారు. మండల ఏపీఎం రాజారెడ్డి, సీసీలు సాయిలు, దుర్గదాస్ పాల్గొని మహిళలు సమాజ మార్పుకు మార్గదర్శకులవాలని సూచించారు. శిక్షణలో పాల్గొన్న మహిళలు ఈ కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగకరమైందని తెలిపారు.

## తెలంగాణ ప్రజా సాహిత్యోద్యమ పితామహుడు “వట్టికోట “జయంతి

**సూర్య కామారెడ్డి టౌన్**



ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (ఎ), కామారెడ్డి తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం ‘తెలంగాణ ప్రజా సాహిత్యోద్యమ పితామహుడు వట్టికోట ఆళ్వారుస్వామి’ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ రచ యిత, సేవాశీలి, ఉద్యమకర్త, కమ్యూని స్టు నేత, ప్రచురణకర్త అయినటువ ంటి వట్టికోట ఆళ్వారుస్వామి భిన్న కోణాల్లో సమాజంపై తన ముద్ర వేశాడ న్నారు. ఇటువంటి మహనీయుల ను వారి జయంతి సందర్భంగా స్మరించు కోవడం మనందరి గురుతర బాధ్యత అని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. కిష్టయ్య మాట్లాడుతూ సాహిత్య రంగంతో పాటు, పత్రికా రంగంలో కూడా తనదైన శైలిలో ముద్ర వేశారని, ప్రజలలో చైతన్య ం తీసుకరావాడానికీ, నిజాం పరిపాలనలోని అరాచకాలను అరికట్టడానికి అలుపెరుగని పోరాటం చేశా రన్నారు. సమన్వయకర్త అంకం జయప్రకాష్ నేటితరం విద్యార్థులు ఇలాం టి మహనీయుల ఆశయాలను దృష్టిలో ఉంచు కొని ముందుకు సాగాలని అన్నారు. ఈ సమావేశంలో హిందీ విభాగ అధ్యక్షులు డా. జి. శ్రీనివాస రావు, తెలుగు విభాగపు అధ్యాపకులు కె. రవి కుమార్, జి. మల్లేష్, ఎన్. ఆంజనేయులు, బి. మహేష్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి ని సన్మానించిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**సూర్య ఇందూర్**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదా రుగా శుక్రవారం బోధన్ శాసన సభ్యు లు సుదర్శన్ రెడ్డి నియమి తులయ్యా రు.ఈ నేపథ్యంలో ప్రభుత్వ సలహాదా రు సుదర్శన్ రెడ్డి హైదరా బాదులోని నివాసానికి వెళ్లి ఆయనను నిజామాబా ద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకుల పల్లి భూపతిరెడ్డి శాలువాతో సన్మానించి, శు భాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే వెంటా తాహెర్ బిన్ హం దన్,జిల్లా డిసిసి అధ్యక్షులు,రాష్ట్ర కోపరేటివ్ కార్పొరేషన్ మానాల మోహన్ రెడ్డి ఉన్నారు.

## బిక్షాటన చేసిన ఎస్ఎఫ్ఐ

**సూర్య కామారెడ్డి టౌన్**



రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్నటు వంటి సుమారు 8 వేల కోట్ల రూ పాయలను తక్షణమే విడుదల చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు, విద్యార్థులకు ఫీజ్ రియంబర్స్మెంట్ కింద విడు దల చేయాలని కామారెడ్డి పట్టణ ంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు అరుణ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులు అధిక వర్షాల పట్ల నష్ట నివారణ చర్యలు చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



ప్రస్తుతం జిల్లాలో చోటు చేసుకుంటున్న అధిక వర్షాల కారణంగా పంటల నష్టం నివారించేందుకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. ముఖ్యంగా ఉద్యాన పంటలు కూరగాయలు, పూల పంటలు, మామిడి, అరటి, పనస, చింత, మిరప, టమోటా వంటి పంటల రైతులు ఈ క్రింది సూచనలను పాటించాలన్నారు.

**సాధారణ సూచనలు**

1. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా వెంటనే కాలువలు ఏర్పరచి నీరు వెలుపలికి వెళ్లేలా చూడాలి. 2. వర్షపు నీరు ఎక్కువగా నిలిచే ప్రాంతాల్లో తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలి. 3. వర్షం తగ్గిన తర్వాత తడి నేలపై యంత్రసామగ్రిని ఉపయోగించడం నివారించాలి. 4. ఆకులు తడిగా ఉన్నప్పుడు ఎరువులు లేదా పురుగుమందులు పిచికారీ చేయరాదు.

పంటల వారీ సూచనలు

**అరటి పంట:** మొక్కలు వాలిపోకుండా మద్దతులు (స్టాకింగ్) ఇవ్వాలి. నీరు నిల్వ ఉండకుండా చూడాలి.

**మామిడి పంట:** వర్షం ఆగిన వెంటనే పండ్ల కుళ్లను నివారించేందుకు కాపర్ ఆక్సీక్లోరైడ్ (3 గ్రా/లీ) పిచికారీ చేయాలి.

టమోటా, మిరప, వంకాయ: నీరు నిల్వ ఉండకపోవాలి. ఫంగల్ వ్యాధులు కనిపిస్తే మాన్కోజెబ్ లేదా కాపర్ ఆధారిత మందులు పిచికారీ చేయాలి.

**పూల పంటలు:** పువ్వులు కుళ్లకుండా నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా ఉండేలా చూసుకోవాలి.

**కొబ్బరి, పపయ:** గాలి వేగం ఎక్కువగా ఉన్నప్పుడు మొక్కల చుట్టూ నేల దృఢంగా చేయాలి, వాలకుండా చూడాలి.

**అత్యవసర సూచనలు**

పంట నష్టాన్ని గమనించిన రైతులు వెంటనే స్థానిక వ్యవసాయ అధికారి / ఉద్యాన శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.వర్షాల తరువాత పంటలు పునరుద్ధరణకు సంబంధించిన సూచనలు జిల్లా ఉద్యాన శాఖ ద్వారా అందించబడతాయి. రైతులు పంటలను రక్షించుకోవటానికి శాఖల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, సహజ విపత్తు వల్ల కలిగే నష్టాన్ని తగ్గించేందుకు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

**కూరగాయలు:** , టమాట, వంకాయ, ఉల్లి, మిరప, బెండ, తీగ జాతి కూరగాయలలో తీసుకోవలసిన చర్యలు పొలంలో నిలిచిన నీటిని తీసివేయాలి పంట మీద 13-0-45 ఏ 5 గ్రా లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి మొక్కలకు మట్టిని ఎగదోయాలి, నిటారుగా పెరిగే మొక్కలకు ఊతమివ్వాలి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు యూరియా ద్రావణం ఏ 10 గ్రా / లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి, చనిపోయిన మొక్కలను తీసివేసి ఆ ప్రదేశంలో మళ్లి విత్తుట లేదా నారు నాటుట చేపట్టాలి కలుపు నివారణకు అంతర కృషి చర్యలు చేపట్టాలి 19-19-19 ఏ 5 గ్రా లీటరు నీటికి చొప్పున పిచికారీ చేయాలి తరువాత సూక్ష్మపోషక మిశ్రమం ఏ 2.5 గ్రా లీటరు నీటికి చొప్పున పిచికారీ చేయాలి, మిరపలో 10 గ్రా యూరియా ం 10 గ్రా చక్కర ఒక లీటరు నీటికి చొప్పున కలిపి వారం వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేయాలి మొక్కలు ఎక్కువ కాలం నీటిలో మునిగినట్లైతే మెగ్నిషియం సల్ఫేట్ 5 గ్రా లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి, ఇనుము ధాతువు లోపం కనిపించినట్లైతే 50 గ్రా అన్నభేది ం 10 గ్రా నిమ్మఉప్పు 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పంట పై పిచికారీ చేయాలి. ఆకు మచ్చ, బూడిద బూజు తెగుళ్ల నివారణకు కార్బన్డజిమ్ ం మాంకోజెబ్ 2.5 గ్రా లీటరు నీటికి చొప్పున కలిపి వారం వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేయాలి. కాయ తొలుచు పురుగుల నివారణ కోసం నోవాల్యూరాన్ 0.75 ml లీటరు నీటికి చొప్పున లేదా థయోధికార్బ్ 1 గ్రా లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. బాక్టీరియా ఆకు మచ్చ తెగులు , కోనోఫోరా ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రా ం ప్లాంటమైసిన్ 1 గ్రా 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి., కాయ కుళ్ళు, పక్షి కన్ను తెగులు నివారణకు ప్రొపికోనజోల్ 1 ml లీటరు నీటికి లేదా డైఫెంకోనజోల్ 0.5 ml లీటరు నీటికి చొప్పున కలిపి వారం వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేయాలి.

**బంతి:, నారు దశలో :** కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా/లీ (లేదా) కార్బెండజిమ్ - 2 గ్రా/లీటర్ లేదా క్యాప్టాన్ ఏ 2 గ్రా స్ప్రే (లేదా) మొక్క మొదలులో పోయాలి.ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని రైతులందరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# నవంబర్ 15న స్పెషల్ లోక్ అదాలత్

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారత లక్ష్మీ, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

ప్రజల విస్తృత ప్రయోజనాలకు పెద్దపీఠ వేస్తు నవంబర్ 15 న కోర్టు ప్రాంగణాలలో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ జి. వి. ఎన్ భారత లక్ష్మీ తెలిపారు. జిల్లాకోర్టు ప్రాంగణంలోని తన చాంబర్లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు లతో కలిసి విలేఖరులతో మాట్లాడారు.రాజీపడదగిన 1328 క్రిమినల్ కేసులను గుర్తించామని, వాటిని లోక్ అదాలత్ బెంచ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.విబేధాలు వచ్చినప్పుడు సర్దుకుని రాజీ మార్గంలో వెళ్లడమే ఉత్తమమని పేర్కొన్నారు. ఆర్మూర్, బోధన్ కోర్టు ప్రాంగణాలతో పాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక లోక్ అదాలత్ జరుగుతుందని ఆమె వివరించారు.లోక్ అదాలత్ వైపు వెళ్లే మార్గానికి కక్షిదారులను ప్రోత్సహించాలని పౌర సమాజానికి జిల్లాజడ్జి విజ్ఞప్తి చేశారు.మనిషి సంఘజీవి అని సమాజంలో అందరితో కలిసి శాంతియుతంగా జీవించే సమయాలలో సమస్యల విషవలయంలో చిక్కుకోరాదని ఆమె అన్నారు.శాంతియుత సహజీవనమే ప్రజల జీవన విధానంగా మారాలని ఆమె సూచించారు. ప్రజల న్యాయపరమైన వివాదాలు, త్వరితిగతిన రాజీపద్ధతి విధానంలో పరిష్కరించుకోవడానికి



న్యాయసేవల చట్టం అత్యుత్తమని జిల్లాజడ్జి భారత లక్ష్మీ తెలియజేశారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ స్పెషల్ లోక్ అదాలత్ కు పోలీసు శాఖ సంపూర్ణ మద్దతునిస్తు, విజయవంతానికి కృషి చేస్తుందని తెలిపారు. చిన్న చిన్న క్రిమినల్ కేసులు, క్షణిక ఆవేశంలో చేసిన రాజీ పడదగిన కేసులు స్పెషల్ లోక్ అదాలత్ పరిష్కరించుకోవాలనిఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రహైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్ మానస పుత్రిక "స్పెషల్ లోక్ అదాలత్" అని ఆయన అభివర్ణించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారత లక్ష్మి గారితో కలిసి, సమన్వయము చేసుకుంటు ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతానికి ప్రత్యేక కార్యాచరణతో కలిసి నడుస్తున్నామని ఆయన అన్నారు. అందరి దారులు ప్రత్యేక లోక్ అదాలత్ వైపు కదలాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అకాక్షించారు.న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు మాట్లాడుతూ న్యాయవాదులను, న్యాయమూర్తులను, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటు న్యాయ వివాదాలను న్యాయార్థుల అభీష్టం మేరకు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

## నాలుగు సంచుల వడ్లు దొంగతనం

**సూర్య, నాగిరెడ్డి పేట్ .**

నాగిరెడ్డిపేట్ మండలంలోని రాఘవ పల్లి గ్రామానికి చెందిన రైతు చింతలపల్లి రాజు తాను పండించిన వడ్లను ఆరబెట్టి సంచుల్లో నింపి ఉంచగా శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు సంచుల వడ్లను దొంగిలించుకుపోయినట్టు ఇంచార్జీ ఎస్ హెచ్ వో మనోహర్ రావు తెలిపారు.రాజు రాఘవపల్లి శివారులో తన వరి పొలంలో పంట కోసిన జాతీయ రహదారి సమీపంలోని పెట్రోల్ బంక్ ఏరియాలో వడ్లు ఆరబెట్టి, సంచుల్లో నింపి ఉంచగా అందులో నుంచి నాలుగు సంచులను సుమారు మూడు క్వింటాళ్ల వరి ధాన్యమును రాత్రిపూట ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్టు ఎస్ హెచ్ వో తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

## ఐకెపి ఆధ్వర్యంలో రెండవ రోజు శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న మహిళా సమాఖ్య సభ్యులు

**సూర్య ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయం లో రెండవ రోజు శిక్షణ లో భాగంగా మండల సమాఖ్య అధ్యక్షురాలు పావని ఆమోదించిన అంశాల పై ఆయా గ్రామాల గ్రామ సమాఖ్య మహిళా అధ్యక్షురాలు, మహిళా సమాఖ్య సభ్యులు చర్చించారు ఈ సమావేశంలో ఏపీఎం రామ్ నారాయణ గౌడ్ మాట్లాడారు, నిర్వహణ,హాజరు,పుస్తక నిర్వహణ,రికార్డుల భద్రత కార్యాలయాల ఏర్పాటు,కార్యాలయ ల నిర్వహణ,5 కమిటీ ల ఏర్పాటు,చేసుకోవాలి అని అన్నారు 1)బ్యాంక్ లింకేజ్ కమిటీ,2)పర్యవేక్షణ కమిటీ.3)జండర్ కమిటీ.4)ఆస్తుల పరిశీలన కమిటీ.5)అప్పుల రికవరీ కమిటీ పై కమిటీ ల పనితీరు పైన పూర్తి అవగాహన చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని, అర్హులకు వాటి ఫలితాలు అందేవిధంగా సమాఖ్య అధ్యక్షురాలు కృషి చేయాలని, ఇట్టి విషయాల పైన ఆరుమసాల వరకు ఫాలోప్ చేయడం జరుగుతుందని. ఏపీఎం రామ్ నారాయణ్ గౌడ్ తెపిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో (సి ఆర్ పి లు) శోభరాణి, నాగశ్రీ వివిధ గ్రామ సంఘాల పాదాది కారులు , సీసీ లు , సుజాత , సంధ్య, పోచవ్వ, రమేష్ గౌడ్, గోపాల్, మండల సమాఖ్య అకౌంటెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

## అత్యాచారానికి గురైన మహిళ కుటుంబాన్నిఅన్ని విధాలుగా ఆదుకోవాలి

**- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కు వినతి**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

పాల్వంచ మండలం ఫరీద్ పేట్ గ్రామంలో గత నెల26న ఆదివారం రోజున రైస్ మిల్ లో పనిచేసే బీహార్ కూలి వల్ల అత్యాచారానికి గురైన బాధిత మహిళ కుటుంబానికి స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించడం జరిగింది. బాధిత మహిళకు ధైర్యం చెప్పి,ప్రభుత్వం నుండి వచ్చే బెనిఫిట్స్ కల్పిస్తామని చెప్పడం జరిగింది. డిఆర్ఓ లోకల్ బాడీస్ మధుసూదన్ కి, SC డెవలప్మెంట్ ఆఫీసర్ వెంకటేష్ కి తొందరగా వచ్చేటట్లు చూడమని చెప్పడం జరిగింది. నిందితుడిని పట్టుకోవడంలో విశేష కృషిచేసిన ASP చైతన్య రెడ్డికి, రూరల్ సిఐ రామన్ కి శాలువాతో సన్మానం చేయడం జరిగింది. బాధిత మహిళ విషయం గురించి సమాచారం ఇవ్వగానే వచ్చిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ని శాలువాతో సన్మానం చేసిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కామారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టెంకి బాల్ రాజు,జిల్లా ఉపాధ్యక్షులు తమ్మడి స్వామి,తమ్మడి రాజు, mrps మాజీ రాష్ట్ర కార్యదర్శి బట్ట వెంకట్ రాములు ఇందులో సఖి సెంటర్ మేడమ్స్,DBF శంకర్ అన్న DVMC మెంబర్, mrps రాష్ట్ర ఉపాధ్యక్షులు R.భాగయ్య, జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయిలు, AIAYS మాచారెడ్డి మండల అధ్యక్షులు మారుపాక లక్ష్మి రాజం, కొత్తపల్లి మల్లయ్య, రాజు,రాములు, రమేష్,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

**-జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు**

**సూర్య- బిక్కనూర్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని, జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కుంట లింగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.